ఘజియాపూర్‌లో పచ్చదనంతో కప్పేసిన డంపింగ్‌యార్డు నుంచి బోర్‌వెల్స్‌తో గ్యాస్ తీసుకుని విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్




# కాదేదీ వ్యర్థం.... ప్రతి దానికొక అర్థం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే:

మంచి ఆచరణను ఎక్కడ నుంచైనా మనం తీసుకోవాలి...చెత్త సద్వినియోగంలో దిల్లీ పరిసర ప్రాంతాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి...ఈ మార్గనిర్దేశాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే బాగుంటుందని స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ భావించింది... ఈ ప్రాజెక్టులను ఔత్సాహికులకు చూపించటం ద్వారా వారి, వారి ప్రాంతాల్లోనూ అటువంటి విధానాలు అమలు చేయటానికి ప్రయత్నిస్తారని సాంకేతిక శిక్షణ, క్షేత్రస్థాయి అధ్యయనాలను ఏర్పాటు చేసింది...ఈ ప్రక్రియలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు దిల్లీలో జాతీయ స్థాయి కార్యశాలను ఏర్పాటు చేసింది. దీనిలో రాష్ట్రం నుంచి తెనాలి పురపాలక సంఘం ఆహ్వానం అందుకుంది. ఆరోగ్యాధికారి డాక్టర్ రమణ, కంపోస్టుయార్డులో చెత్తతో ఎరువు తయారీ యూనిట్‌ను పర్యవేక్షిస్తున్న ఎప్సిలాన్ ప్రతినిధి సాయికేష్ పురపాలక సంఘ ప్రతినిధులు దిల్లీ వెళ్లి కార్యశాలలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో చెత్త సద్వినియోగ ప్రాజెక్టులను పరిశీలించారు. చెత్త చెత్త కాదు, సద్వినియోగపరిస్తే మళ్లీ ఉపయోగపడుతుందిఅన్న నానుడిని కళ్లకు కట్టి నట్లు అక్కడ గమనించారు. దిల్లీలో అంతర్భాగంగా ఉన్న పలు ప్రాంతాల్లో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యమంతో విజయవంతంగా నడుస్తున్న పలు ప్రాజెక్టులను మనం ఒకసారి పరిశీలిద్దాం...

## మనమూ ఆచరిద్దాం

- దిల్లీ పరిసరాల్లో చెత్త సద్వినియోగంతో సత్ ఫలితాలు
- 'నమూనా' విధానాలంటూ స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ కితాబు
- క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తెనాలి పురపాలక బృందం

**ఘజియాపూర్‌లో గ్యాస్ ఉత్పత్తి:** ఇక్కడ డంపింగ్‌యార్డులోని ఒక భాగాన్ని పచ్చదనంతో కప్పేసి(సైంటిఫిక్ ఫిల్లింగ్) చేసి, లోపలకి బోర్‌వెల్స్ వేసి అందులో నుంచి గ్యాస్ తీసి, దానితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను మండించటం ద్వారా భారీ విద్యుత్ ప్లాంట్ నడుపుతున్నారు. దీనిలో ప్రతి రోజూ 1300 టన్నుల చెత్తను సద్వినియోగం చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

**గుల్‌మెహర్‌లో పేపరు వ్యర్థాల నుంచి సరికొత్త ఉత్పత్తులు:** ఇక్కడ స్థానికంగా సేకరించిన పేపర్ వ్యర్థాల నుంచి వివిధ రకాల పెట్టెలు, పెన్ను స్టాండ్‌లు తదితరాలు తయారు చేస్తున్నారు. ఈ యూనిట్‌లో ఏకంగా 350 మంది ఉపాధి పొందుతున్నారు.



గుల్‌మెహర్‌లో పేపరు వ్యర్థాల నుంచి సరికొత్త ఉత్పత్తులు

**నెరెళ్లభావనలో నీటి శుద్ధి ప్లాంట్:** ఇక్కడ ఘనవ్యర్థాల నిర్వహణ పార్కులో, చెత్త కింది నుంచి వచ్చే మురికి నీటిని శుద్ధి చేసి స్థానికంగా ఉద్యానవనాలకు వినియోగిస్తున్నారు. ఇక్కడే చెత్తతో ఎరువు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతికంగా డంపింగ్ యార్డు నిర్వహణ కూడా జరుగుతున్నాయి.

**న్యూమోతీభాగ్‌లో ఎన్ని రకాల వినియోగమో:** 110 ఎకరాల ప్రభుత్వ వెంచర్ అయిన న్యూమోతీభాగ్‌లో ఉత్పత్తి అయిన చెత్త సమగ్రంగా సద్వినియోగం అయ్యేలా లోపలే అన్ని రకాల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఎరువు, పిల్లెట్ తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఆయిల్ తీసే ప్రక్రియ తదితర అన్ని కార్యక్రమాలను 'గేటెడ్ కమ్యునిటీ' లోపలే జరుగుతున్నాయి.

**బురారిలో భవన నిర్మాణ వ్యర్థాలతో ఇసుక, ఇటుకల తయారీ:** ఈ యూనిట్‌లో పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన భవన నిర్మాణ వ్యర్థాలతో ఇసుక, ఇటుక ఇతర విభిన్న ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్నారు. 2010లో దిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ అనంతరం ఉత్పత్తి అయిన నిర్మాణ వ్యర్థాలను ఈ ప్లాంట్ ద్వారా సద్వినియోగం చేసుకున్నారు.



భవన నిర్మాణ వ్యర్థాల నుంచి ఇటుకలు, ఇతర ఉత్పత్తుల తయారీ



ఘజియాపూర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్

## మనం ఎక్కడ

ఈ విధానాలను పరిశీలించిన తర్వాత మనం ఎక్కడున్నామన్న ప్రశ్న కచ్చితంగా స్థానిక నగరాలకు, పురపాలక సంఘాలకు ఉదయించాలి. గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో పరిశీలిస్తే గుంటూరు సమీపంలో త్వరలో పొడిచెత్తతో విద్యుత్తు ఉత్పత్తికి భారీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవన నిర్మాణ వ్యర్థాలను సద్వినియోగం చేసే ప్లాంట్ విజయవాడ సమీపంలో ఏర్పాటు చేయటానికి ఆలోచనలు జరుగుతున్నా ముందడుగు లేదు. తెనాలిలో తడి-పొడి చెత్తల సద్వినియోగం కొంత మేరకు జరుగుతున్నా, ఇంకా చేయాల్సింది చాలా ఉంది. మొత్తం మీద చూస్తే మన దగ్గర ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వాటిని సరైన రీతిలో కంపోస్టుయార్డులకు తరలించటమే ఇక్కడి వారికి తలకు మించిన పనిగా మారింది. ఈ నమూనా విధానాలు అమలు చేయాలంటే ఇంకా పయనించాల్సిన దూరం చాలా ఉంది. ఎక్కడో కాదు మన దేశంలోనే విభిన్న ప్రాంతాల్లో చెత్త సద్వినియోగం అవుతున్న తీరు పరిశీలించిన తర్వాతైనా మనవారు మరింత వేగంగా ముందడుగు వేయాలి. లేకుంటే ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా మన నగరాలు, పట్టణాలు ఉన్న చోటనే ఉండిపోతాయి.